నీ వాక్యము నన్ను బ్రతికించియున్నది. కీర్తనలు 119:50
నీ వాక్యములు వెల్లడిఅగుట తోడనే వెలుగు కలుగును. కీర్తనలు 119:130
వాక్యపు వెలుగు

# గురుతు

**యోహాను 20: 25** గనుక తక్కిన శిష్యులు మేము ప్రభువును చూచితిమని అతనితో చెప్పగా అతడు నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను.

పై వచనాన్ని జాగ్రత్తగా గమనిస్తే, యేసు క్రీస్తు వారి శిష్యులలో ఒకరైన అపోస్తలుడైన తోమా ప్రభువుని గుర్తు పట్టడానికి తాకి చూస్తే కాని నమ్మనంటే నమ్మను అన్నాడు.

అంటే ప్రభువుని గుర్తు పట్టడానికి ఒక పద్దతి అయనను తాకి చూడటం.

అయితే పరిశుద్ధ గ్రంథంలో దేవుడు కొంత మందిని, కొన్ని నిబంధనలను, కొన్ని సంగతులను గురుతు పట్టడానికి ఏర్పాటు చేసిన వివిధ రకాల గురుతులను చూద్దాము. మరి ఆ సంగతులను గూర్చి మనమెందుకు నేర్చుకోవాలంటే, **యిర్మియా 15:19** ప్రకారము అది దేవుడు మనకు విధించిన నిబంధన కాబట్టి.

**యిర్మియా 15:19** కాబట్టి యెహోవా ఈలాగు సెలవిచ్చెను– నీవు నా తట్టు తిరిగిన యెడల నీవు నా సన్నిధిని నిలుచునట్లు నేను నిన్ను తిరిగి రప్పింతును. **ఏవి నీచములో యేవి ఘనములో నీవు గురుతు పట్టిన యెడల నీవు నా నోటి వలె ఉందువు,** వారు నీ తట్టునకు తిరగవలెను గాని నీవు వారితట్టునకు తిరగకూడదు.

కాబట్టి **ఏవి నీచమైవో యేవి ఘనమైనవో నీవే గురుతు పట్టాలి.** ఎందుకంటే, బైబిల్ అంతా ప్రతిది రెండు రెండుగా పెట్టి, దేనిని ఎన్నుకోవాలో ఆ చిత్తము దేవుడు మనకే ఇచ్చాడు. అయితే వాటిలో ఏవి నీచమైవో, యేవి ఘనమైనవో దేవుడు తన పరిశుద్ధ గ్రంథంలో ముందే మనకు చెప్పి ఉన్నాడు.

పరిశుద్ధ గ్రంథంలో రెండు రెండుగా పెట్టిన కొన్నింటిని ఉదాహరణగా చూద్దాము.

1. బండ మీద ఇల్లు – ఇసుక మీద ఇల్లు
2. మంచి – చెడు
3. గోధుమలు – గురుగులె
4. జీవ వృక్షము – మంచి చెడుల తెలివినిచ్చు వృక్షము
5. వెలుగు – చీకటి
6. పరలోకము – నరకము
7. బుద్ధిగల కన్యకలు – బుద్ధిలేని కన్యకలు
8. సంకరి – పరిసయ్యుడు
9. దరిద్రుడైన లాజరు – ధనవంతుడు
10. నయోమి ఇద్దరు కోడళ్లు
11. సిలువలో ప్రభువుతో పాటు ఇద్దరు దొంగలు

ఇలా రెండు రెండుగా చెప్పిన కొని ఉదాహరణలు కేవలము ఆదికాండము నుంచి చూద్దాము.

**1. అర్పణ:** కయీను అర్పణ మరియు హేబేలు అర్పణ

**2. నడక:** కయీను కుమారుడైన హనోకు (ఆది 4: 18) మరియు యెరెదు కుమారుడైన హనోకు (దేవునితో నడచిన హనోకు ఆది 5: 18)

**3. రక్షణ:** నోవా మరియు తన తరము వారు.

**4. విశ్వాసము, విధేయత:** అబ్రహాము మరియు లోతు

**5. వాగ్దానము ద్వారా:** ఇస్సాకు మరియు ఇశ్మాయేలు
**6. పోరాటము**: యాకోబు మరియు ఏశావు
**7. పరిశుద్ధ జీవితము:** యేసేపు మరియు తన అన్నదమ్ములు
**8. భర్తకి లోబడడంలో:** శారా మరియు హగరు
ఇలా చెప్పుకుంటూ పోతే బైబిల్‌లో ఇలాంటివి అనేకము చూడవచ్చును.

**1.ఆకాశంలో నిబంధన ధనస్సు గురుతు:**

**ఆది 9:13** మేఘములో నా ధనస్సు ఉంచితిని. అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గురుతుగా నుండును. దేవుడు జలప్రళయం తర్వాత ఇక మీదట భూమిని, దాని నివాసులను ఎప్పటికినీ జలప్రళయం ద్వారా నాశనం చేయనని ఒక నిబంధన గుర్తుగా ఆకాశంలో ఒక ధనస్సునుంచాడు. అది దేవుడు నోవాహుతో చేసిన నిత్య నిబంధన.

**2. ఇంటికి రక్తము గురుతు:**

**నిర్గమ 12:7** ఈ నెల పదునాలుగవ దినము వరకు మీరు దాని నుంచుకొనవలెను, తరువాత ఇశ్రాయేలీయుల సమాజపు వారందరు తమ తమ కూటములలో సాయంకాలమందు దాని చంపి దాని రక్తము కొంచెము తీసి, తాము దాని తిని యిండ్ల ద్వారబంధపు రెండు నిలువు కమ్ములమీదను, పై కమ్మి మీదను చల్లి.
**నిర్గమ 12: 13** మీరున్న యిండ్ల మీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తము చూసి మిమ్మును నశింప చేయక దాటిపోయెదను. నేను ఐగుప్తు దేశమును పాడు చేయుచుండగా మిమ్ము సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు.

**3. యింటి కిటికి ఎర్రని దారపు గురుతు:**

**యెహోషువా 2: 18** నీవు మమ్మును దించిన ఈ కిటికీకి ఈ ఎఱ్ఱని దారమును కట్టి, నీ తండ్రిని, నీ తల్లిని, నీ అన్నదమ్ములను నీ తండ్రి యింటి వారినందరిని నీ యింట చేర్చుకొనుము.
**యెహోషువా 6: 25** రాహాబను వేశ్య యెరికోను వేగుచూచుటకు యెహోషువా పంపిన దూతలను దాచి పెట్టి యుండెను గనుక అతడు ఆమెను ఆమె తండ్రి యింటి వారిని ఆమెకు కలిగిన వారినందరిని బ్రదుకనిచ్చెను. ఆమె నేటి వరకు ఇశ్రాయేలీయుల మధ్య నివసించుచున్నది.

**4. శరీరానికి సున్నతి గురుతు:**

**నిర్గమ 4: 26** అప్పుడు ఆమె – ఈ సన్నతిని బట్టి నీవు నాకు రక్తసంబధమైన పెనిమిటివైతివనెను.
**యెహోషువా 5:3** యెహోషువా రాతి కత్తులు చేయించుకొని సున్నతి గిరి అను స్థలము దగ్గర ఇశ్రాయేలీయులకు సున్నతి చేయించెను.
అయితే **రోమా 2: 29** ప్రకారము ఈ సున్నతి నిబంధన కేవలము శరీర సంబంధమైనదిగా కాకుండా ఆత్మ సంబంధమైనదిగా (హృదయ సంబంధమైనదిగా) ఉండాలని దేవుడు కోరుకున్నాడు.

**5. ఆత్మ ముద్ర:**

**ఎఫెసి 1:13** మీరును సత్య వాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మ చేత ముద్రించబడితిరి.
**ఎఫెసి 4:30** దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి. విమోచన దినము వరకు ఆయన యందు మీరు ముద్రింపబడి యున్నారు.

మనమీద పరిశుద్ధాత్మ ముద్ర ఉందని ఇతరులు ఎలా గుర్తించాలి?

**ఎఫెసి 4:31, 32** సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వమును మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి.

**ఉండకూడని గురుతులు:**

**1. కయీను గురుతు:**

**ఆది 4:15** అందుకు యెహోవా అతనితో కాబట్టి యెవడైనను కయీనును చంపినయెడల వానికి ప్రతి దండన యేడంతలు కలుగుననెను. మరియు ఎవడైనను కయీనును కనుగొని అతనిని చంపక యుండునట్లు యెహోవా అతనికి ఒక గురుతు వేసెను.

**2. 666 గురుతు:**

**ప్రకటన 13: 17, 18** ఆ ముద్ర, అనగా ఆ మృగము పేరైనను దాని పేరిట సంఖ్యయైనను గలవాడు తప్ప, క్రయ విక్రయములు చేయులకు మరి యెవనికిని అధికారము లేకుండునట్లును అది వారిని బలవంతము చేయుచున్నది. బుద్ధిగలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము; అది యొక మనుష్యుని సంఖ్యయే; ఆ సంఖ్య ఆరువందల అరువది యారు; ఇందులో జ్ఞానము కలదు.

**హెచ్చరిక:**

**లూకా 2:34** సుమెయోను వారిని దీవించి ఇదిగో అనేక హృదయాలోచనలు బయలుపడునట్లు, ఇశ్రాయేలులో అనేకులు పడుటకును, తిరిగి లేచుటకును వివాదాస్పదమైన గురుతుగా ఈయన నియమించబడి యున్నాడు; యేసయ్య క్షయమైన వాటికి వ్యతిరేకి. మనం కోల్పోయిన అక్షయతను తిరిగి ఇవ్వడానికే అందుకే ఆయన వచ్చాడు. ఇది లోకం ఒప్పుకోదు. అందుకే ఆయన వివాదాస్పదమైన గురుతు.

**రెండవ రాకడ గురుతులు:**

**మార్కు 13:4** (ఆయన శిష్యులు ఆయనను చూచి) ఇవన్నియు నెరవేరబోవు కాలమునకు **ఏ గురుతు** కలుగును? అది మాతో చెప్పుమని ఆయనను ఏకాంతమందు అడగగా,
ఆయన వారితో

- అనేకులు నా పేరట వస్తారు.
- మీరు యుద్ధములను గూర్చియు, యుద్ధ సమాచారములను గూర్చి వింటూ ఉంటారు.
- రాజ్యము మీదికి రాజ్యము లేచును.
- భూకంపాలు, కరువులు, వేదనలు వచ్చును.
- మిమ్మును సభలకు అప్పగించెదరు.
- మిమ్మును సమాజ మందిరములో కొట్టించెదరు. మొదలైనవి.

ప్రియ సహోదరుడా, సహోదరి, ఇంకా దేవుని గూర్చిన ఆ సువార్తను అలక్ష్యం చేస్తున్నావా? జాగ్రత్త రెండవ రాకడ అతి సమీపముగా ఉన్నది. **అ.కా. 12: 14** ఆమె (రొదే అను చిన్నది) పేతురు స్వరము **గుర్తు పట్టింది.** అందుకు మిగిలిన వారు నీవు పిచ్చిదానవనిరి. నిన్ను కూడా క్రీస్తును గూర్చిన సువార్త ప్రకటిస్తుంటే, ఆయన స్వరము ఎరగని వారు, **గుర్తు పట్టని వారు**, పిచ్చి దానిలాగా, పిచ్చివాడి లాగా చూస్తారు. నువ్వు సహించాలి. ఆ చిన్నది చెప్పినట్టు దేవుని సువార్త దృఢముగా చెప్పాలి. అయితే నీకు దేవుని స్వరము, దేవుని సేవకుల స్వరము గురుతు పట్టే అనుభవం నీకు ఉందా? జాగ్రత్త.